క్లుప్తంగా

మహేష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన పిన్నెల్లి రమా



మాచర్ల రూరల్: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహాయకుడు బోయ మహేష్‌రెడ్డి కుటుంబాన్ని పిన్నెల్లి రమా శనివారం పరామర్శించారు. మహేష్‌రెడ్డి కుమారుడు అమరేశ్వరరెడ్డి(17 నెలలు) అనారోగ్యంతో మృతి చెందాడు. కార్యక్రమంలో మాచర్ల ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, నాయకులు బోయ మల్లారెడ్డి, వీరారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, తీయగూర వెంకటరెడ్డి, గంటా నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మాచర్ల రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలోని అరుణాచలేశ్వరుని దర్శించుకునేందుకు(గిరి ప్రదక్షిణ)కు మాచర్ల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం బత్తుల వీరాస్వామి శనివారం తెలిపారు. వివరాలకు 9959225432, 7382895100, 73828010482 సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ప్రతిభా పురస్కారాలకు ఇద్దరు ఎంపిక





పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం 2024- 25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఇంటర్ ప్రతిభా పురస్కారాల్లో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన స్కాలర్స్ విద్యాసంస్థల ఇద్దరు ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, జగదీశ్ రెడ్డి శనివారం తెలిపారు. అందులో జి.శ్రావణి, షేక్ జాస్మిన్ ఇద్దరు 989 మార్కులు సాధించి పిడుగురాళ్ల మండలం ప్రతిభ పురస్కారాల్లో వీరిద్దరి విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

ఉపకార వేతనాలకు విద్యార్థులు ఎంపిక



అచ్చంపేట: మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన అయిదుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అగస్టీన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు యేడాదికి రూ.6 వేలు చొప్పున కేంద్రం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందన్నారు. వేల్పూరులోని జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన డి.రేవతి, ఎన్.అఖిల్, ఎస్.జయశ్రీ, వై.అపర్ణ, కె.లక్ష్మీ తిరుపతమ్మలు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు కేశవరావు, రాజారావు అభినందించారు.

10 వరకు ఏపీ సేవా పోర్టల్ సేవలు నిలిపివేత

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు శనివారం నుంచి ఈ నెల 10వ తేదీ రాత్రి వరకు ఏపీ సేవా పోర్టల్ ద్వారా అందించే సేవలు నిలిచిపోతాయని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ వార్డు, సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్ నిర్వహణ పనుల నిమిత్తం సేవలు నిలిపివేయనున్నట్లు వివరించారు.

బాలిక అదృశ్యంపై కేసు

సత్తెనపల్లి: బాలిక అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన బాలిక గత నెల 28వ తేదీ నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల ఆరా తీశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో శనివారం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కట్టమూరుకు చెందిన అశోక్ అనే యువకుడికి ఆ బాలికతో పరిచయం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఆ దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

సత్తెనపల్లి: అధిక కట్నం కోసం భార్యని వేధిస్తున్న భర్త, అత్తమామలు, ఇరువురు ఆడపడుచులపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామానికి చెందిన ఐశ్వర్యకు, పెదకూరపాడు మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన నల్లమేకల గోపీకి రెండు ఏళ్ల క్రితం వివాహమైంది. గోపీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మనస్పర్థలు రావడంతో ఈ నెల 2న అధిక కట్నం కోసం తనపై దాడి చేసి పుట్టింటికి పంపారని ఐశ్వర్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో తన భర్త, అత్తమామలు, ఇరువురు ఆడపడుచులు తనను వేధిస్తున్నారని సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఐశ్వర్య ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

- భక్తిశ్రద్ధలతో పిడుగురాళ్లలో నమాజు
- ఈద్గాలో భారీ సంఖ్యలో హాజరైన ముస్లింలు



పిడుగురాళ్ల ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

పిడుగురాళ్ల: త్యాగాలకు ప్రతీకైనా బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు తక్బీర్ చదువుకుంటూ మర్కస్ మసీదు నుంచి జానపాడు రోడ్‌లోని ఈద్గా వద్దకు వెళ్లారు. మర్కస్ మసీదు ముఫ్తీ అబ్దుల్ ఖాదిర్ మాట్లాడుతూ ఖురాన్ ప్రకారం భూమిపైకి అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు, ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించి నివాసయోగ్యంగా మార్చారు అన్నారు. అల్లా ఆరాధన కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని కూడా నిర్మించి దైవ ప్రవక్తగా ఆయన పేరుపొందారు. ఇబ్రహీం తనకు లేకలేక పుట్టిన బిడ్డకు ఇస్మాయిల్ అని పేరు పెట్టారు. ఓ రోజు దైవ ప్రవక్త నుంచి ప్రవక్త ఇబ్రహీంకు బహుమతిగా ఇవ్వాలని కలలో అల్లా చెప్పడంతో ప్రవక్త ఇబ్రహీం ఖుర్బానిగా ఓ ఒంటెను బలిస్తాడు. అయినా మళ్లీ అదే కల రావడంతో తన కుమారుడినే బలిదానం కోరుకుంటున్నారని భావించిన ప్రవక్త ఇస్మాయిల్ ను బలి ఇవ్వటానికి సిద్ధపడ్డారు. ఇస్మాయిల్ మెడపై కత్తి పెట్టి జుబాహ్‌కు ప్రవక్త ఇబ్రహీం ఉద్యుక్తుడవుతుండగ అతని త్యాగానికి మెచ్చిన అల్లాహ్ దీనికి బదులుగా ఓ జీవాన్ని బలివ్వాలని జిబ్రాయిల్ అనే దూత ద్వారా కోరతారు. అప్పటి నుంచే బక్రీద్ రోజున ఖుర్బాని ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని, ఖుర్బానీ చేసిన మాంసాన్ని పేదలకు పంచివారు కూడా పండుగను అందరితో పాటు ఆనందంగా జరుపుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ముఫ్తి అబ్దుల్ ఖాదర్ పండుగ నమాజును చదివించారు. ఖుత్బా అనంతరం దువా చేసిన తర్వాత ఒకరినొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణ అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ మేస్త్రి పట్టణ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్, మైనార్టీ నాయకులు ఎండీ జబ్బార్, ఎండీ లతీఫ్, ఎండీ ఖయ్యూం, ఎండీ సిద్ధిక్, అంజుమన్ కమిటీ సెక్రటరీ మస్తాన్ వలి, పఠాన్ మాభు, గౌస్ బాబు సాహెబ్, జానీ బాబు, అబ్దుల్ కరీం, ఆప్టికల్ జానీ బాషా, షేక్ లతీఫ్, ఖిద్మత్ పట్టణ అధ్యక్షులు ఎండీ బాబర్, ఎండీ అలీమ్, హఫీస్ అబ్దుల్ ఖాదర్, షేక్ హుస్సేన్, షేక్ జానీ బాషా, ముస్లిం పెద్దలు, ముస్లిం యూత్ పట్టణ ముస్లింలు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల మర్కస్ మసీదు నుంచి ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్తున్న ముస్లింలు



రెంటచింతలలోని రేగులమాన్యం వద్ద ప్రత్యేక ప్రార్థనలు

రెంటచింతలలో

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో నున్న ముస్లింలు శనివారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీద్‌లలో, బహిరంగ ప్రదేశాలలో సామూహికంగా హజరత్‌లాల(మతపెద్దలు) ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెంటచింతలలోని యర్రబాలెం ఆంజనేయస్వామి మాన్యం, రైల్‌పేట మసీద్‌లలో, మిట్టగుడిపాడు, మల్లవరం, పశర్లపాడు, పాలువాయి, రెంటాల, మంచికల్లు, తుమృకోట గ్రామాలలో నున్న ఈద్గాల నందు, మస్‌జిద్‌లలో బక్రీద్ ప్రత్యేక నమాజ్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్..

మాచర్ల రూరల్: త్యాగానికి, విశ్వాసానికి మానవతా విలువలకు, మత సామాజిక ఐక్యతను పెంపొందించే ఈద్ -అల్ -అదా (బక్రీద్) పండుగను శనివారం ముస్లిం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఈద్గా రహమాన్, మర్కస్ మస్‌జిద్‌లలో మత పెద్దలు బోధనలు చేశారు. ఈద్గాలో ముక్తి అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ ప్రేమ, త్యాగం, సహనం పరోపకారానికి ప్రతిరూపకంగా బక్రీద్ జరుపుకోవటం ఆనందకరమని విశ్వసతనీయతకు, త్యాగాలకు విలువనిచ్చే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ జలీల్, కరిముల్లా, మస్తాన్, సత్తార్, సులేమాన్ పాషా, రహమాన్, సుభాని, జాని, సైదా, బాషా పాల్గొన్నారు.



ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ట్యూమర్‌లను అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

- ఆధునిక ఆపరేషన్లతో ట్యూమర్లు తొలగింపు
- పిల్లల్లో, పెద్దవాళ్లలోనూ బ్రెయిన్‌ట్యూమర్‌లు
- వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నేడు



గుంటూరు మెడికల్: 'పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన శ్రీనాథ్ ఏడాదిగా తలనొప్పి, చూపు మసకగా కనిపించం లాంటి లక్షణాలతో పలు ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్య సమస్య పరిష్కారం కాలేదు. చివరకు గుంటూరులో న్యూరోసర్జరీ వైద్యులను సంప్రదించగా తలలో గడ్డ ఉందని(బ్రెయిన్‌ట్యూమర్) నిర్ధారించి ఆపరేషన్ చేసి తలలో ఉన్న గడ్డను తొలగించారు.

ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోవటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్‌లను సకాలంలో గుర్తించకపోవటంతో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డేను నిర్వహిస్తున్నారు.

లక్షణాలు...

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో కణాలు చనిపోకుండానే కొత్తకణాలు పుట్టుకొచ్చి కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా(గడ్డ) మారతాయి. కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి, వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గటం జరుగుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారటం, నడవటం కష్టంగా ఉండటం తదితర లక్షణాలు ఉంటాయి. బ్రెయిన్ ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్‌లో ఏర్పడిన ప్రదేశం బట్టి, ట్యూమర్ రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంలా కనిపిస్తాయి.

బ్రెయిన్ ట్యూమర్‌కు కారణాలు...

బ్రెయిన్ ట్యూమర్‌లు జన్యుపరలోపాల వలన, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకటం, సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వలన రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి.

జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు...

గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలను చేస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు నాలుగు గంటల నుండి ఎనిమిదిగంటల వరకు సమయం పడుతుంది. సుమారు మూడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.

బాధితులకు చికిత్స ఇలా...

బ్రెయిన్ ట్యూమర్ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం న్యూరోసర్జరీ వైద్య నిపుణులు, న్యూరాలజిస్టులను సంప్రదిస్తున్నారు. జిల్లాలో 20 మంది న్యూరోసర్జన్లు, 25 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు. వారంలో ఇరువురు లేదా ముగ్గురు బ్రెయిన్ ట్యూమర్స్ సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో న్యూరోసర్జరీ వైద్య విభాగంలో ప్రతినెలా 20 మందికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు చేస్తున్నారు. న్యూరోసర్జరీ వైద్య విభాగంలో 2023లో 2,011 మంది, 2024లో 2,603 మంది, 2025 జనవరి నుంచి మే వరకు 2,626 మంది చికిత్స పొందారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 2023లో 16,176 మంది, 2024లో 40, 381 మంది, 2025 జనవరి నుండి మే నెల వరకు 20,765 మంది వివిధ రకాల బ్రెయిన్ సంబంధిత సమస్యలతో చికిత్స పొందారు.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం



బ్రెయిన్ సర్జరీలకు ఎండోస్కోపిక్ సర్జరీలు, కీహోల్ సర్జరీలు, నేవిగేషన్ గైడెడ్, మైక్రోస్కోపిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. న్యూరోసర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఆధునిక వైద్యం ద్వారా నూటికి 95శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి.

డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరోసర్జన్, గుంటూరు

ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గర్తించవచ్చు...



న్యూరోసర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో నేడు బ్రెయిన్ ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. ట్యూమర్‌లను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పనిలేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. అన్ని ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. జనాభాలో ఒకశాతం మంది బ్రెయిన్ ట్యూమర్స్‌తో బాధపడుతున్నారు. అవగాహన చాలా తక్కువగా ఉంది.


–డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, న్యూరోసర్జన్, గుంటూరు

ఏడాదైనా రహదారి మరమ్మతులు శూన్యం



సత్తెనపల్లి: పట్టణంలోని 12వ వార్డులో రహదారి అధ్వానంగా ఉన్నప్పటికీ పాలకులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. 10 నెలల క్రితమే కౌన్సిల్లో ఆమోద ముద్ర పొంది కాంట్రాక్టర్ అగ్రిమెంట్ అయినప్పటికీ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పన్నుల వసూళ్లకు శ్రద్ధ చూపే అధికారులు ఈ పనుల గురించి పట్టించుకోవడం లేదని, వర్షం పడితే యాతన పడాల్సి వస్తోందన్నారు. గృహాలు లేని ప్రాంతాలకు, వెంచర్లకు ప్రాధాన్యత ఇస్తూ ఇళ్ల వద్ద మాత్రం రహదారి నిర్మించకపోవడం తగదన్నారు. సంక్రాంతి నాటికి అన్ని రహదారులను మరమ్మతు చేయిస్తామని చెప్పిన పాలకులకు ఏడాదైనా ఈ రహదారి కనిపించడం లేదు.

క్షేత్ర స్థాయిలోనూ బలోపేతానికి కృషి



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు, నియోజకవర్గంలోని మండల ఇన్‌చార్జులతో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి దుడ్డు రామకృష్ణ మాదిగ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి వరకు ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాలకు నూతన కమిటీల ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామంలో జెండా ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

నిత్య యోగాతో మానసిక ప్రశాంతత

ఆయుర్వేద వైద్యులు శ్రీనివాసరావు



యోగా గురువు సన్మానిస్తున్న యోగా శిష్యులు

పిడుగురాళ్ల: నిత్య యోగా సాధన ద్వారా ఆరోగ్య రక్షణతో పాటుగా మానసిక ప్రశాంతత లభిస్తుందని బెల్లంకొండ ఆయుష్ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 46వ యోగా శిక్షణ కేంద్రం ముగింపు కార్యక్రమం ఆనంద మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రంలో యోగా మాస ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం ఉద్యోగి 50 మందిని యోగ అభ్యాసకులుగా మార్చేలా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నకరికల్లు యోగాచార్యులు బ్రహ్మయ్య, పిడుగురాళ్ల శాఖ యోగాచార్యులు అరవపల్లి పూర్ణ రమేష్, ఉప యోగాచార్యులు వీడేలా రమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర యోగా సేవ కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న నూతన యోగ సాధకులకు సైంటిఫిక్ యోగ పుస్తకాలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటుతున్న జనరల్ మేనేజర్ రామకృష్ణారెడ్డి

సత్రశాల(రెంటచింతల): భావితరాల మనుగడ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం స్థానిక పరాశక్తి ఫ్యాక్టరీ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో కలిసి ఆయన మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదన్నారు. భవిష్యత్ తరాలకోసం పర్యావరణ సంరక్షణ మనందరి బాధ్యత అని చెప్పారు. పర్యావరణాన్ని వినాశనం చేస్తున్న ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండి పర్యావరణాన్ని ప్రేమిస్తూ మన వంతు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగించడం వలన కలిగే నష్టాలను అవగాహన కలిగినప్పుడే వాటి వినియోగం తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో ప్రతి ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడవ.. ముగ్గురికి గాయాలు



అమరావతి: స్థానిక బస్టాండు సమీపంలోని వైన్‌షాప్ వద్ద మద్యం మత్తులో కొందరి మధ్య జరిగిన దాడిలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం దుర్గావిలాస్ సెంటర్‌లో ఉన్న మద్యం షాపు సమీపంలో జరిగిన గొడవలో వెల్డింగ్ పని చేసుకునే మౌలాలికి, పసుపులేటి నాగేశ్వరరావుకు మరికొందరితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో రాత్రి 7.30గంటల సమయంలో పసుపులేటి నాగేశ్వరరావు బస్టాండు సమీపంలో మద్యం షాపునకు వచ్చాడు. మధ్యాహ్నం తనతో గొడవ పడి దాడి చేసిన నాగేశ్వరరావుపై బ్లేడ్‌తో గొంతు ప్రదేశంలో మౌలాలి గాయపరిచాడు. అడ్డుకోబోయిన ఏపూరి కోటేశ్వరరావు, తోట రమేష్‌లకు చేతులపై గాయాలయ్యాయి. నాగేశ్వరరావు గొంతు వద్ద తీవ్ర గాయం కావటంతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసం గుంటూరుకు తీసుకెళ్లారు. అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు మౌలాలిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

తాడికొండ: కారు–ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. మేడికొండూరు మండలం నుంచి తుళ్లూరు మండలం పెదపరిమిలో శుభకార్యానికి కారు వెళుతోంది. ఈ సమయంలో తాడికొండ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తాడికొండ అడ్డరోడ్డులో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనం ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరి యువకుల్లో ఒకరికి కాలు విరిగి తలకు బలమైన గాయం కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఆటోలో గుంటూరు ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ప్రజలకు భారంగా మారే ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు

సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్



మాట్లాడుతున్న నళినీకాంత్

లక్ష్మీపురం: విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ పేరుతో వినియోగదారులపై భారం మోపుతుందని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినికాంత్ పేర్కొన్నారు. బ్రాడీపేట పార్టీ కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచారంలో భాగంగా ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి మీటర్ బిగించేటప్పుడే మూడు నెలల అడ్వాన్స్ బిల్లు డిపాజిట్‌గా కట్టించుకుంటూ, ప్రీ పెయిడ్ పద్ధతి తీసుకురావడం అన్యాయం అని అన్నారు. పీక్ అవర్స్‌లో స్మార్ట్ మీటర్ ద్వారా అదనపు చార్జీ వసూలు చేసేలా మరో దుర్మార్గపు ఎత్తుగడకు ప్రభుత్వం పాల్పడనుందని అన్నారు. సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య, ఎండాకాలంలో పగలు పూట వాడే కరెంటుకు ఎక్కువ చార్జీ వసూలు చేయటం ఈ స్మార్ట్ మీటర్ ప్రత్యేకత అని ఆరోపించారు. ఇప్పటి వరకు తక్కువ యూనిట్లు కరెంటు కాల్చే పేదవాళ్లకు తక్కువ బిల్లు వచ్చేదని, రాబోయే కాలంలో ఈ అవకాశం ఉండదన్నారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ స్మార్ట్ మీటర్ ఖర్చు రూ.15 వేలు బలవంతంగా ప్రజలతో కట్టించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందన్నారు. 96 నెలల్లోపు ఈ బిల్లు చెల్లించాలని ఉత్తర్వులలో పేర్కొందని వివరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను, ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీలను, విద్యుత్ సెకీ ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం నేతలు అధికారంలోకి రాగానే వాటినే కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశిం షహీద్ పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూ నగర్: అనంతపురం జిల్లాలో దళిత బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, హోంమంత్రి దళిత మహిళ అయినప్పటికీ ఈ విషయంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో రూ.1.60 లక్షల మోసం

లక్ష్మీపురం: సాఫ్ట్ వేర్ సంస్థలో ఉద్యోగానికి రూ.1.60 లక్షలు చెల్లించి ఉద్యోగవకాశం కల్పించకుండా మోసం చేసిన వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిత్యనగర్ 2వ లైన్‌కు చెందిన ఎస్.గురు అరవింద్ అనే యువకుడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకలాడుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన షేక్ సద్దాం అనే యువకుడుని సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం అవకాశం కల్పించాల్సిందిగా కోరాడు. అయితే సద్దాం సెనో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పాడు. దీంతో గురు అరవింద్ సంస్థ మేనేజర్ సుహాస్‌ను పరిచయం చేసుకుని ఉద్యోగం కోసం అడుగగా అతనితో పాటు ప్రసాద్ రెడ్డి, హేమంత్‌కుమార్ అనే వారు ఈ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం కోసం రూ.1.80 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో గురు అరవింద్ గత ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన రూ.1.60 లక్షలు చెల్లించాడు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో మోసానికి గురైనట్లు గుర్తించిన గురు అరవింద్ అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com